క్లుప్తంగా

ప్రభుత్వ విప్ పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో మడేలయ్య జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, మాజీ జెడ్పీటీసీ రుక్మిణి, నాయకులు చేపూరి గంగాధర్. శ్రీనివాస్, సదానందం, నాగరాజు, అవధూత శ్రీధర్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. వట్టిమల్లలో గాజుల మల్లయ్య మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు.

నియామకం

సిరిసిల్లటౌన్: పార్లమెంట్ ఎన్నికల కోసం అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలను కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ బుధవారం నియమించారు. సిరిసిల్లకు చెందిన టీపీసీసీ సభ్యుడు, సీనియర్ నాయకుడు సంగీతం శ్రీనివాస్‌ను చొప్పదండి నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్‌గా ఉత్తర్వులు జారీచేశారు.

విచక్షణతో మెదలాలి

సిరిసిల్లటౌన్: బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నేతలపై అవాకులు చెవాకులు పేలొద్దని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో ఆయన మాట్లాడారు. కేకే మహేందర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సిరిసిల్లలో ఫోన్‌ట్యాపింగ్‌పై త్వరలోనే తేలుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలు విచక్షణతో మెదలాలన్నారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వైద్య శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, వంగ మల్లేశ్, రఫిక్, పరుశురాం, అఫ్సాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాట నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, తిరుపతి, సాహెబ్, లింగం గౌడ్, భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

వన్య ప్రాణులకు తొట్లు ఏర్పాటు

కోనరావుపేట: కోనరావుపేట సెక్షన్ పరిధిలోని నిమ్మపల్లి బీట్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్లలో బుధవారం నీటిని పోయించారు. సెక్షన్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిదృష్ట్యా వన్యప్రాణులు తాగునీటి కోసం అల్లాడుతూ గ్రామాల్లోకి వస్తూ వేటగాళ్ల బారిన పడుతున్నాయన్నారు. వాటికోసం అటవీ ప్రాంతంలోని సాసర్లలో ట్యాంకర్ల ద్వారా నీటిని పోయించినట్లు తెలిపారు. వన్యప్రాణులకు హాని తలపెడితే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. చిరుతపులి, ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయని తునికాకు, ఇప్పపూవు సేకరణకు అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని సూచించారు.

నగదు పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని వెంకట్రావుపల్లె చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆ సమయంలో బందనకల్‌కు చెందిన పొన్నం బాబు వద్ద రూ.55,300 పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేలకు మించి డబ్బులు వెంట తీసుకెళ్లవద్దని సూచించారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లి మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గసభ్యులు బీఆర్ఎస్‌కు బుధవారం రాజీనామా చేశారు. మాజీ సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందని, గ్రామాభివృద్ధి కోసం కార్యకర్తలతోపాటు మాజీ ఉపసర్పంచ్ సురేశ్, మాజీ వార్డుసభ్యులు నారాయణ, రాజేందర్, శేఖర్ కలిసి పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

బోయినపల్లి: స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ బుధవారం కరీంనగర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా రాజయ్యకు విజ్ఞప్తి చేసినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. ఆయనవెంట కొంకటి మధు ఉన్నారు.

ఇద్దరు బైండోవర్

వీర్నపల్లి: మండంలోని లాల్‌సింగ్ తండా పంచాయతీకి చెందిన మాలోత్ ప్రకాశ్, భూక్య మధన్ గ్రామంలోని అడవిని ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరిని బైండోవర్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ ముందు బైండోవర్ చేశారు.

చేపల పెంపకానికి చేయూత

- మత్స్యకారులకు వరం.. 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన'
- జిల్లాలో 42 సొసైటీలు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక
- ఒక్కో సొసైటీకి రూ.15 లక్షలు అందజేత
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

రుద్రంగి: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం మత్స్యకార సొసైటీలకు వరంగా మారింది. జిల్లాలోని 42 సొసైటీలను ఈ పథకానికి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఒక్కో సొసైటీకి రూ. 15లక్షలు అందజేయనున్నారు. పథకంపై మత్స్యకార సొసైటీల సభ్యులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

పథకం లక్ష్యం..

జిల్లాలోని మత్స్యసహకార సంఘాలు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అందజేస్తున్నారు. ఈ పథకంతో చేపల చెరువులు తవ్వి చేపల పెంపకం, విక్రయించడం చేపవిత్తనాలు (పిల్లల) పెంపకం వంటి వివిధ పనులపై అవగాహన కల్పిస్తూ ఉపాధి మార్గాలను చూపనున్నారు. తద్వారా జిల్లాలోని మత్స్యకార కుటుంబాల్లో చేతినిండా పని దొరికి ఆర్థిక స్వావలంబన చేకూరనుంది.

ఏ సొసైటీలు అర్హత?

ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తూ, ఇప్పటికే చేపల చెరువుల ద్వారా చేపలు ఉత్పత్తి చేస్తూ మార్కెటింగ్‌లో ముందుంటున్న సొసైటీలను ఈ పథకానికి అర్హులుగా ఎంపిక చేశారు. మరికొన్ని సొసైటీలను కూడా ఈ పథకానికి ఎంపిక చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు.

రూ.15 లక్షల వినియోగం ఎలా..?

పథకానికి ఎంపికైన మత్స్యసహకార సంఘాలు రూ.5లక్షలు రెండేళ్లలో పొందుతారు. మిగిలిన రూ.10 లక్షలు వారు ఏ యూనిట్‌నైతే తీసుకుంటామని తీర్మానించుకుంటారో ఆ యూనిట్ వివరాలతో తీర్మానపత్రం, సహకార సంఘంసభ్యులు తీర్మానం చేసి, మత్స్య సహకార సంఘం ఖాతాలో రూ.10 లక్షలు డిపాజిట్ చేసుకుంటే ప్రభుత్వం రూ. 10 లక్షల గ్రాంట్‌ను ఖాతాలో జమచేస్తుంది. ఈ పథకంలో ఫిష్ పాండ్స్ నిర్మించడం, చేప విత్తనాలను (చేప పిల్లలను) ఉత్పత్తి, వాల్యు అడిషన్స్, చేపల వంటకాలు, పచ్చళ్లు, పౌడర్స్, ఎండుచేపల విక్రయాలు, ఉత్పత్తి చేసిన చేపలను ఇతర రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి చేయడం, కోల్డ్ స్టోరేజీలు, కోల్డ్ రూంలు, ఐస్‌గోడౌన్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు.

జిల్లాలో 127 సొసైటీలు..

జిల్లాలో 127 సొసైటీలుండగా 8140 మంది సభ్యులు తమ సభ్యత్వాలను నమోదు చేసుకున్నారు. ఇంకా నమోదు కాల్సిన వారు చాలామంది ఉన్నట్లు సొసైటీల సభ్యులు తెలిపారు. 42 సొసైటీలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికచేశారు. జిల్లాలో మొత్తం మత్స్యకారుల జనాభా సుమారు 25 వేల పైనే ఉన్నట్లు మత్స్యకారులు పేర్కొన్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని 42 మత్స్య సహకార సంఘాలను పథకానికి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇంకా కొన్ని సొసైటీలను ఎంపిక చేసే అవకాశం ఉంది. దీనిపై మత్స్య సహకార సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పథకం మత్స్యకార కుటుంబాల్లో ఎంతో ఆర్థిక స్వావలంబన తీసుకొస్తుంది.

– శివ ప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

సద్వినియోగం చేసుకోవాలి



ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన సొసైటీలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని. పథకంతో మార్కెటింగ్ చేసుకుంటూ సొసైటీలు ఎంతో అభివృద్ధి చెందవచ్చు.

– రాంచంద్రం, జిల్లా మత్స్య సహకార సంఘం చీఫ్ ప్రమోటర్

ప్రజాపాలనలో భాగస్వాములు కండి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడఅర్బన్ మండలం రుద్రవరం మాజీ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ వంకాయల భూమయ్య 30 మందితో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అర్బన్ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, ఎంపీటీసీలు గాలిపల్లి సువర్ణస్వామి, వనపర్తి దేవరాజుతోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన మున్నూరు సంఘం నాయకులు

ఎల్లారెడ్డిపేట: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మున్నూరుకాపు సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. వేములవాడలోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నాయకులు మీసం రాజం, బాద రమేశ్, సాన యాదగిరి, వడ్నాల నారా యణ, అల్లం రాజం తదితరులు విప్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

'బీఆర్ఎస్ పాలనలో అవినీతి, కుంభకోణాలు'



మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్, భూ కబ్జాలు, లిక్కర్‌స్కాంతో పూర్తిగా అవినీతి పాలన సాగించిందని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌లో నిర్దోషిగా నిరూపించుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కనిమెని చక్రధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బండలింగంపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లలో వార్‌రూం ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్‌తోనే కాంగ్రెస్ ఓటమికి బీఆర్ఎస్ కారణమైనట్లు అనుమానాలున్నాయని, దీనిపై ఫిర్యాదు చేసిన కేకేకు నోటీసులు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. కేకేకు నోటీసులు పంపే ముందు కేటీఆర్ నిర్దోషిగా నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు అమలుచేసినట్లు తెలిపారు. సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బాల్‌రాజ్ రమేశ్, నాయకులు అంజిరెడ్డి, హైమద్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, ఇమామ్, కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేపట్టాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



బోయినపల్లి: మధ్యమానేరు ప్రాజెక్టు నీరులేక ఎండిపోయేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత, వైఫల్యమే కారణమని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బోయినపల్లి నుంచి సిరిసిల్ల వెళ్తున్న క్రమంలో బుధవారం కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి పరిసరాల్లో తేలిన పూర్వ శాభాష్‌పల్లి గ్రామ ఆనవాళ్లు, కట్టడాలను పరిశీలించారు. సర్కారు మేడిగడ్డ బ్యారేజీ కుంగిన పిల్లర్లకు రక్షణ చర్యలు చేపడితే మధ్యమానేరుకు ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేడిగడ్డలో కుంగిన పిల్లర్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు జక్కుల నాగరాజు తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కోనరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం, తదితరులు

కోనరావుపేట: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని ఏపీఎం రాకేశ్ అన్నారు. మండలంలోని మామిడిపల్లి, నిమ్మపల్లి, మరిమడ్ల, భుక్యారెడ్డితండా, గొల్లపల్లి(వట్టిమల్ల) గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. సీసీలు శోభారాణి, రేణుక, బాలరాజు, జనార్దన్, ఏతవోలు సహజ, ప్రవంతి, గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు అనుముల రమాదేవి, నందిని, లావణ్య, బండ రేణుక, భుక్యా రాజేశ్వరి, కాసర్ల పవిత్ర వీవోఏలు, సీఏలు సాగర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలో, నర్మాలలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ సీసీలు పద్మ, లావణ్య కోరారు. సీఏలు శైలజ, సంతోష, దేవలక్ష్మీ, ఏతవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు పాల్గొన్నారు.

ఒక్క రైతుకైనా పరిహారం అందించారా?



తంగళ్లపల్లి: రైతులు పంటలు నష్టపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రైతుకైనా పరిహారం అందించిందా అని మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. బుధవారం మండలంలోని జిల్లెల్ల గ్రామ శివారులోని కాలువలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువల నిర్మాణానికి 60 ఎకరాలకు 57 ఎకరాలకు నష్ట పరిహారం అందించి కాలువలు పూర్తిచేసిన ఘనత కేటీఆర్‌దేనన్నారు. పార్టీల మార్పు గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు కేకే.మహేందర్ రెడ్డి ఎన్ని పార్టీలు మారారో తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బొడ్డు శ్రీధర్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు కుంగడంతోనే కరువు

ముస్తాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగడంతోనే కరువు వచ్చిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ గుండం నర్సయ్య విమర్శించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశంలో మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి కొరత ఏర్పడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడానికే బీఆర్ఎస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవని బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. సమావేవంలో ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ కర్రెల్ల కొండల్‌రెడ్డి, తలారి నర్సింలు, భానుచందర్, మహేందర్‌రెడ్డి, తాళ్ల విజయ్, రాజు, రమేశ్, ముద్దం రాజు, వెల్ముల రాంరెడ్డి, బాల్‌రెడ్డి, సత్యం, అంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో ఇబ్బందులు తొలగుతాయి



వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, నాయకులు

వేములవాడరూరల్: నక్కవాగు బ్రిడ్జి నిర్మాణంతో ఇబ్బందులు తప్పనున్నాయని మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబు అన్నారు. మండలంలోని హన్మాజిపేటలో నక్కవాగు బ్రిడ్జి నిర్మాణాన్ని బుధవారం పరిశీలించారు. దాదాపు రూ.11.55 కోట్లతో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జిని గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి ప్రారంభించామన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో హన్మాజీపేట, బొల్లారం, లింగంపేట, కోనరావుపేట మండలాల్లోని గ్రామాల కల నెరవేరుతుందన్నారు. సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, పిట్టల వెంకటేశ్, సుమన్, మాజీ ఎంపీ టీసీలు అంజయ్య, సంతోష్, పార్టీ సీనియర్ నాయకులు లచ్చిరెడ్డి, సోషల్ మీడియా సభ్యులు పసుల అంజి, నరేశ్, నరేశ్, వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోయినపల్లి: పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతి ష్ఠాపనలో భాగంగా మండలకేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పిల్లా పాపలు చల్లంగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలు నిర్వహించేదెలా?

- మండలంలోని పలుగ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలు కరువు
- మరికొన్ని గ్రామాల్లో అసంపూర్తి పనులు
- సమావేశాలు నిర్వహించేందుకు మహిళా సంఘాల సభ్యుల ఇబ్బంది



నిమ్మపల్లిలో సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

మండలంలోని సంఘాల వివరాలు
మండలంలో మొత్తం గ్రామాలు : 28
మొత్తం స్వశక్తి సంఘాలు: 997
వికలాంగుల సంఘాలు: 30
మండలంలో మొత్తం సంఘాలు: 27
సంఘాల్లో చేరిన సభ్యులు: 11468



పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన ఈ భవనం మండలంలోని పల్లిమక్త మహిళా సంఘం భవనం. ఈ భవనానికి రూ. 2లక్షలు మంజూరు కాగా పిల్లర్లస్థాయి వరకు పనులు జరిగాయి. తర్వాత నిధులు లేకపోవడంతో నిలిచిపోయింది. మహిళా సంఘాల సభ్యులు ప్రతినెలా సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ అసంపూర్తి భవనానికి నిధులు మంజూరు చేయాలని ఇటీవల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కోరారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది మండలంలోని అజ్మీరాతండా మహిళా సమాఖ్య భవనం. భవన నిర్మాణానికి గతంలో రూ.2లక్షల చొప్పున రెండుసార్లు మంజూరయ్యాయి. రూ.4లక్షల నిధులతో స్లాబ్ లెవెల్ వరకు పనులు జరిగాయి. ఆపై నిధులు లేకపోవడంతో అసంపూర్తిగానే నిలిచిపోయింది. దీంతో సంఘాలకు ఇబ్బందులు పడుతున్నారు.

కోనరావుపేట: మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు కృషిచేస్తున్నామని ప్రకటిస్తున్న అధికారులు ఆ దిశగా కృషి చేయడంలేదు. గ్రామాల్లో మహిళాసంఘాల సభ్యులకు ప్రతినెలా రెండుసార్లు సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఇవి గాక ప్రతి మహిళా సంఘం నెలకోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసుకుంటారు. అయితే పలుగ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలు లేకపోవడంతో మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ఇళ్లలోనే సమావేశాల నిర్వహణ

మండలంలోని ఎగ్లాస్‌పూర్, బావుసాయిపేట, కోనరావుపేట, మామిడిపల్లి, నిజామాబాద్, శివంగాలపల్లి అజ్మీరాతండా, కమ్మరిపేట తండా, రెడ్డితండా, గొల్లపల్లి (వట్టిమల్ల), రాజన్న గొల్లపల్లి(కొలనూర్), గోవిందరావుపేటతండా గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలు లేవు. గ్రామాల్లో సంఘం భవనాలు లేకపోవడంతో మహిళా సంఘాల సభ్యుల ఇళ్లలోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు.

మరుగుదొడ్లు కరువే

గ్రామాల్లో మహిళా సంఘం భవనాలు ఉన్న గ్రామాల్లో కనీస వసతులు లేవు. మరుగుదొడ్లు కూడా నిర్మించకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. మండలంలోని ఒక్క వెంకట్రావుపేట, మర్తనపేట, మంగళ్లపల్లి గ్రామాల్లో తప్ప మిగతా గ్రామాల్లో మరుగుదొడ్లు లేవు. కనగర్తిలో నిర్మాణదశలో ఉంది.

భవనం లేక ఇబ్బందులు



గ్రామంలో మహిళా సంఘం భ వనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతినెలా సమావేశాలు నిర్వహించడం కష్టంగా మారింది. మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

–తాంద్ర వనజ, ఎగ్లాస్‌పూర్ అధ్యక్షురాలు

అద్దె భవనంలోనే..



గ్రామంలో ఇప్పటివరకు మహిళా సమాఖ్య భవనం లేదు. సంఘాల సమావేశాలు నిర్వహించేందుకు కష్టంగా ఉంది. సొంత భవనం లేకపోవడంతో ఓ అద్దె భవనంలోనే సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాం. సొంత భవనం ఉంటే మహిళల సమస్యలు పరిష్కారమవుతాయి.

– అబ్బగోని యమున, బావుసాయిపేట

ప్రతిపాదనలు తయారుచేస్తాం



పలుగ్రామాల్లో మహిళా సంఘాలకు భవనాలున్నాయి. కొన్నిగ్రామాల్లో పునాదులు, పిల్లర్లస్థాయిలో నిలిచిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో భవనాలు లేక మహిళా సంఘాల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామసంఘాల ద్వారా ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కారిస్తాం.

–రాకేశ్, ఏపీఎం, కోనరావుపేట

దొడ్డి కొమురయ్యకు నివాళి

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయసాధనకు కృషి చేయాలని ఉమ్మడి మండల గొల్ల, కురుమ యాదవ సంఘం అధ్యక్షుడు మెండే శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బోయినపల్లి(చొప్పదండి): దొడ్డి కొమురయ్య జీవితం ఆదర్శనీయమని జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య పేర్కొన్నారు. విలాసాగర్, బోయినపల్లిలో కొమురయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, సంబ లక్ష్మీరాజం, కుర్మసంఘం నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పొత్తూరులో కురుమ సంఘం జిల్లా విద్యా కమిటీ అధ్యక్షుడు పోలె శ్రీనివాస్ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలల నివాళి అర్పించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీరయ్య, మురయ్య, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో సెక్స్ రాకెట్?

- మండల కేంద్రంలోని పలు ఇళ్లలో పోలీసుల సోదాలు
- భయాందోళనలో స్థానికులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి సోదాలు నిర్వహించారు. మండలకేంద్రంలోని పలు ఇళ్లపై దాడులు చేశారు. పోలీసులు ఎందుకు ఇళ్లలో సోదాలు చేస్తున్నారో తెలియక ప్రజలు భయాందోళన చెందారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విస్తృత తనిఖీలు చేపట్టింది. సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ మహిళా స్థానికంగా సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు పోలీసులు పలు ఇళ్లపై దాడులు చేశారు. ఎస్సై మాట్లాడుతూ తమ చుట్టుపక్కల ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే 87126 56374 లేదా డయల్ 100లో తెలపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ శివారులో బుధవారం కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో గ్రామానికి చెందిన రాచకొండ అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అశోక్ బైక్‌పై వెళ్తుండగా కందికట్కూర్–పాండలపురం రోడ్డుపై కారు ఢీకొంది. కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.